



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

రూ.9 వేలు చేసుకోండి

- జీడి ధరపై మంత్రి అప్పలరాజు ప్రతిపాదన
- ఆ రేటుకూ కొనలేం : వ్యాపారులు
- ఎవరికీ నష్టం లేకుండా ధర నిర్ణయిస్తాం : కలెక్టర్
- మద్దతు ధర ఇవ్వాలి : జీడి రైతు సంఘం

ప్రజాశక్తి - పలాస

జీడి మద్దతు ధరకు జీడిరైతు సంఘం ఆధ్వర్యాన జీడి రైతుల పోరాటం నేపథ్యంలో రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ స్పందించారు. పలాస తహశీల్దార్ కార్యాలయంలో జీడి వ్యాపారులు, జీడి రైతు సంఘం నాయకులతో వారు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ 80 కేజీల జీడిపిక్కల బస్తాను రూ.తొమ్మిది వేలకు కొనుగోలు చేయాలని ప్రతిపాదన చేశారు. ఉద్దాన ప్రాంతంలోని జీడి విస్తీర్ణాన్ని ఈ-క్రాప్ చేసి రైతుభరోసా కేంద్రాల ద్వారా జీడిపిక్కలను సేకరించి, ప్రతి జీడి పరిశ్రమకు 200 బస్తాల వరకు అప్పగిస్తామని చెప్పారు. దీనిపై పలాస జీడి పరిశ్రమ సంఘం అధ్యక్షులు మల్లా సురేష్ కుమార్, కోశాధికారి రవికాంత్, పారిశ్రామికవాడ జీడి వ్యాపారుల సంఘం అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు, తూముల శ్రీనివాసరావు స్పందిస్తూ ఇటువంటి ప్రతిపాదన వల్ల వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కొంతమంది రైతులు వ్యాపారులతో సమన్వయం చేసుకొని ఆర్థిక లావాదేవీలు చేస్తున్నారని, మరికొంతమంది దళారులతో చేస్తున్నారని చెప్పారు. జీడిపప్పు ధరలు తగ్గిపోవడం వల్లే పరిశ్రమలు బంద్ చేశామన్నారు. ఉద్దాన ప్రాంతంలో పండే జీడి పిక్కలు పది శాతమేనని, ఏడాది పొడవునా పప్పు ఉత్పత్తి చేయాలంటే విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దీనిపై జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, రైతులు దాసరి శ్రీరాములు, కుత్తం వినోద్ కుమార్ మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో పండే జీడిపిక్కలకు మాత్రమే పలాస బ్రాండ్ ఉందని తెలిపారు. అలాంటప్పుడు విదేశాల పిక్కలకు పలాస బ్రాండ్ పేరుతో ఎలా అమ్మకాలు చేపడుతున్నారని ప్రశ్నించారు. పిక్కల ధర తగ్గుతున్నప్పుడు పప్పు ధర ఎలా పెరుగుతుందని, ఈ విషయాన్ని మంత్రి, అధికారులు అర్థం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ఇవ్వాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. గతంలో జీడి రైతులకు ప్రభుత్వం ద్వారా బస్తాకు రూ.వెయ్యి చెల్లిస్తామని మంత్రి చెప్పినా, ఇంతవరకు ఎందుకు చెల్లించలేకపోయారని ప్రశ్నించారు. దీనిపై మంత్రి అప్పలరాజు స్పందిస్తూ మూడేళ్లుగా జీడి రైతులకు న్యాయం చేయాలని ఎంతో తపన పడుతున్నానని చెప్పారు. అయితే పలు కారణాలతో బస్తాకు రూ.వెయ్యి చొప్పున ఇవ్వలేకపోయామన్నారు. జీడి పంటలకు రైతుభరోసా ఇస్తున్నామని, జీడి తోటల్లో అంతర పంటగా వేసుకునేందుకు దానిమ్మ మొక్కలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అంతర పంటలు వేయకపోవడం వల్లే రైతులు నష్టపోతున్నారని చెప్పారు. రైతుభరోసా కేంద్రం ద్వారా జీడిపిక్కలను తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారని తెలిపారు.

ఎవరికీ నష్టం లేకుండా ధర నిర్ణయిస్తాం

రైతులు, వ్యాపారుల మధ్య సమన్వయం లేకపోతే ఇబ్బందులు వస్తాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. రైతులకు నష్టం లేకుండా, వ్యాపారులకు ఇబ్బంది కాకుండా ధరను నిర్ణయిస్తామని చెప్పారు. జీడి పంటలను మ్యాపింగ్ చేసి, పంట దిగుబడి ఆధారంగా వ్యాపారులకు ఎంత సరుకు అప్పగించాలన్న విషయాన్ని పరిశీలిస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌కు జీడిరైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఆర్‌డిఒ పి.సీతారామ్మూర్తి, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, ఎఎంసి చైర్మన్ పి.వి సతీష్, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, జీడి వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అపరిష్కృతంగా ఉన్న ముఖ్యమైన కేసులను సమగ్ర దర్యాప్తుతో త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన గ్రేవ్, ప్రాపర్టీ నేరాలు, పోక్సో, ఎస్‌సి, ఎస్‌టి, ప్రాధాన్యతా కేసుల దర్యాప్తుపై నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హత్య కేసులు, ప్రాపర్టీ, ఉమెన్ నేరాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. నేర నివారణకు సబ్ డివిజన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలన్నారు. రాత్రి గస్తీని బలోపేతం చేసి, తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కేసుల నమోదు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు, ఛార్జిషీట్ దాఖలు వరకు లోతుగా ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రతిరోజూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేయాలన్నారు. గంజాయి కేసుల్లో నిందితులను గుర్తించి కోర్టులో ప్రవేశపెట్టాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలకు సంబంధించిన కేసుల్లో 60 రోజుల్లో ఛార్జిషీట్ దాఖలు చేయాలని తెలిపారు. దర్యాప్తును వేగవంతం చేసి కోర్టులో అభియోగ పత్రాలు వీలైనంత వేగంగా దాఖలు చేయాలని సూచించారు. నేరాల నివారణకు, నేరస్తులను గుర్తించడానికి సిసి కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. అన్ని ముఖ్య కూడళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్, బ్యాంకులు, వ్యాపార సముదాయాలు, ఆలయాల వద్ద సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు డి.బాలచంద్రారెడ్డి, వై.శృతి, జి.నాగేశ్వర్‌రెడ్డి, ఎస్.వాసుదేవ్, ఎస్.బాలరాజు, సిఐలు పాల్గొన్నారు.

నేటి నుంచి హెవీ డ్రైవింగ్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎపిఎస్ ఆర్‌టిసి హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 13వ బ్యాచ్ శిక్షణా తరగతులు ఈనెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 12 బ్యాచ్‌లు దిగ్విజయంగా పూర్తి చేసుకున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందిన వారు పలు శాఖల్లో ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఆర్‌టిసి అద్దె బస్సుల్లోనూ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో ప్రభుత్వం నడుపుతున్నటు ఏకైక డ్రైవింగ్ స్కూల్ ఎపిఎస్ ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ అని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్, మెకానికల్ వర్క్, యోగా, ఫస్ట్ ఎయిడ్ క్లాసులు కూడా బోధించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9963091999, 7989723505 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

22న కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 22వ తేదీన ఉద్దానం ప్రాంతంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా వైద్యారోగ్యశాఖ సంయుక్తంగా కిడ్నీ వ్యాధి నిర్ధారణకు ఉచిత రక్త పరీక్షలు, మందుల సరఫరా చేయనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టులో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కవిటి మండలంలోని మాణిక్యపురం, కంచిలి మండలంలోని ఎం.ఎస్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరం, న్యాయ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ కిడ్నీ వ్యాధి నిర్ధారణ కోసం రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి సీరం క్రియాటిన్ లెవల్ పరీక్ష చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇంతవరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉద్దాన ప్రాంతంలో తొమ్మిది వైద్య శిబిరాలు నిర్వహించిన 3,151 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. వారిలో 263 మందికి కిడ్నీ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణలో తేలిందన్నారు. ప్రజలందరూ ముందుగానే రక్త పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకోవడం ద్వారా కిడ్నీ వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టం కఠినంగా అమలు

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు జిల్లాల వైద్యాధికారుల తీర్మానం

ప్రజాశక్తి - పర్లాకిమిడి

లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆంధ్రా, ఒడిశా సరిహద్దు జిల్లాల వైద్యాధికారులు నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు కాకుండా పరస్పరం సమాచారం ఇచ్చిపుచ్చుకోవాలని తీర్మానించారు. పర్లాకిమిడిలోని సిడిఎంఒ ఛాంబర్‌లో సరిహద్దు జిల్లాల వైద్యాధికారుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాలోని వజ్రపుకొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, పలాస మండలాల్లో పురుషులు ఎక్కువ, స్త్రీలు తక్కువ ఉన్నారు కాబట్టి స్కానింగ్ చేసేటప్పుడు లింగ నిర్ధారణ చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల పరిధిలోని సరిహద్దు ప్రాంతాల్లో గల స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. సరిహద్దు గ్రామాల్లో ఆరోగ్య విద్య, బాలికల ప్రాధాన్యత గురించి అవగాహనా సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. లింగ నిర్ధారణ చేసిన స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడమే కాకుండా వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో సిడిఎంపిహెచ్ ప్రదీప్ కుమార్ పాత్రో, డిఎంఒ ప్రదీప్ కుమార్ పండా, పిసిపిఎన్‌డిటి కోఆర్డినేటర్ జగదీష్ పట్నాయక్, శ్రీకాకుళం జిల్లా ఎడిఎంహెచ్ఒ ఎన్.అనురాధ, డెమో పైడి వెంకటరమణ, డిప్యూటీ డెమో వెంకటేశ్వరరావు, పిసిపిఎన్‌డిటి కోఆర్డినేటర్ ఎస్.సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన సరిహద్దు జిల్లాల వైద్యాధికారులు

సబ్సిడీపై నిత్యావసర వస్తువులు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని రైతుబజార్‌లో ప్రభుత్వ రాయితీతో కూడిన సన్న బియ్యం కేంద్రాన్ని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో వస్తు ఉత్పత్తి తగ్గినప్పుడు డిమాండ్ క్రమంగా పెరుగుతుందన్నారు. దీనివల్ల సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ధరలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు.

ఇటువంటి సమయంలో అటువంటి నిత్యావసర సరుకులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, మార్కెట్ ధరలకు అనుగుణంగా సబ్సిడీపై అందిస్తుందని తెలిపారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో బియ్యం, టమాటా అధిక ధరలు పలుకుతున్నాయన్నారు. ప్రజలు నిత్యం ఉపయోగించే సన్నబియ్యం కిలో రూ.48, సాధారణ బియ్యం కిలో రూ.35కు ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డిఎస్ఒ వెంకటరమణ, తహశీల్దార్ గణపతి, మార్కెటింగ్‌శాఖ ఎడి ఎం.కాళేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సచివాలయాల కోఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్, దుంపల శ్యామలరావు, రైతుబజారు ఇఒ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రభుత్వ పాఠశాల ఆకస్మిక తనిఖీ

- సోషల్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు కలెక్టర్ ఆదేశం
- పలాస ఎంఇఒ-2కు షోకాజ్ నోటీసు

ప్రజాశక్తి - పలాస

ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గదికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. ఆ సమయంలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు పాడి రఘురాంకృష్ణ హాజరు పట్టికలో సంతకం చేయడం చూసి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన్ను సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలను తరచూ సందర్శించి రికార్డులను పర్యవేక్షించడంలో అలక్ష్యం వహిస్తున్నారని ఎంఇఒ-2 సత్యంను మందలించారు. విధుల్లో అలసత్వం వహించిన ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. కలెక్టర్ వెంకట టి.సీతారామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, తహశీల్దార్ మధుసూదన్ ఉన్నారు.

ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రోత్సాహం

- దానేటి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక చేయూత
- రూ.20 లక్షల రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు
- 21న వ్యక్తిత్వ వికాస కార్యక్రమం
- వైద్య నిపుణులు దానేటి శ్రీధర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో విద్యావ్యాప్తిలో భాగంగా ప్రతిభ గల పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు దానేటి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక చేయూత అందించనున్నట్లు ట్రస్టు అధినేత, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ దానేటి శ్రీధర్ వెల్లడించారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు చెందిన ఎందరో విద్యార్థులు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్నారని తెలిపారు. కొందరు విద్యార్థులు ప్రతిభ ఉన్నా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వెనుకబడుతున్నారని, అటువంటి వారికి అర్హతను బట్టి ఆర్థికసాయం అందించి ప్రోత్సహించేందుకు ట్రస్టు ద్వారా శ్రీకారం చుట్టామని చెప్పారు. ఇందుకోసం రూ.20 లక్షల రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అర్హత కలిగిన విద్యార్థులను గుర్తించేందుకు ప్రముఖ విద్యావేత్తలు విశ్రాంత ప్రొఫెసర్ గుంట తులసీరావు, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ పాలకమండలి సభ్యులు జామి భీమశంకర్, ప్రజారోగ్యశాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ పోగిరి సుగుణాకర్, సన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరాంతో పాటు తొమ్మిది మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్న ప్రతిభ గల విద్యార్థులు ఈ కమిటీని సంప్రదిస్తే ఆ విద్యార్థి అవసరాన్ని, అర్హతను బట్టి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు.

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు మహ్మద్ రఫీ, ఇటీవల జిల్లాకు చెందిన ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో జయహో పేరిట ఈనెల 21న మోటివేషనల్ ప్రోగ్రాంను నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు రెండు నుంచి మూడు వేల మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో దానేటి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా సిక్కోలు ఎక్స్‌లెన్స్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జిల్లా విద్యార్థుల్లో స్ఫూర్తి నింపి ప్రతిభావంతులను చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యావేత్త జామి భీమశంకర్, సుగుణాకర్, సన్ డిగ్రీ కళాశాల అధినేత జయరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ దానేటి శ్రీధర్

మీరెందుకు పూర్తి చేయలేదు

రెల్లిగెడ్డ పనులపై స్పీకర్‌ను ప్రశ్నించిన రైతు

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని తాడివలసలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు రెల్లిగెడ్డ పనులపై రైతులు ప్రశ్నించారు. కార్యక్రమంలో భాగంగా స్పీకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అవినీతి, కమీషన్ల కక్కుర్తి కారణంగా రెల్లిగెడ్డలో చప్టా నిర్మాణ దశలో ఉండగానే కొట్టుకుపోయిందన్నారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 'మీరు వచ్చి నాలుగేళ్లు అయింది కదా?. మీరెందుకు పూర్తి చేయలేదు' అని ఒక రైతు ఆయన్ను ప్రశ్నించారు. దీనిపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని, కారకులపై చర్యలు తప్పవని స్పీకర్ బదులిచ్చారు. మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ బస్సు యాత్రలో భాగంగా రెల్లిగెడ్డ వద్ద సెల్ఫీ తీసుకుంటారట, ఏం చేశారని తీసుకుంటారని ప్రశ్నించారు. బస్సు యాత్రను అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. చాలా పథకాలు గ్రామంలో పెద్ద వాళ్లకే అందుతున్నాయని, పేదోళ్లకు అన్యాయం జరుగుతోందని ఒక మహిళ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. ఇల్లు లేని తనకు ఇళ్ల పట్టా ఇవ్వలేదంటూ మరొకరు ఫిర్యాదు చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు స్పీకర్ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, ఎంపిడిఒ సీపాన హరిహరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే హక్కు సర్పంచ్‌కు లేదా?

గ్రామ ప్రథమ పౌరురాలిగా తన పంచాయతీలో చేపడుతున్న పనులు, అవినీతిపై ప్రశ్నించే హక్కు తనకు లేదా? అని తాడివలస సర్పంచ్ తమ్మినైన మణెమ్మ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. జల్ జీవన్ మిషన్ పనులపై ప్రశ్నించడానికి సర్పంచ్ ఎవరంటూ స్పీకర్ అనడమేమిటని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్, మరో రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న సర్పంచ్‌ను గౌరవించలేరా? అని ప్రశ్నించారు.

రీ సర్వేలో అలసత్వాన్ని సహించం

బూర్జ : సమగ్ర భూ రీ సర్వేలో అలసత్వం వహిస్తే సహించేది లేదని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హెచ్చరించారు. మండలంలోని అప్పలపేట సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని నరేంద్రపురం, పాలవలస, మసానుపుట్టి, కొరగాంలో రీ సర్వే నత్తనడకన సాగడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించారు. ఈనెల 22వ తేదీ లోగా ఆయా గ్రామాల్లో రీ సర్వేను పూర్తి చేసి నివేదికను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ చీమల వెంకటరమణ, గణపతిరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



లోగోను ప్రారంభిస్తున్న విద్యార్థులు

నైపుణ్యాభివృద్ధికి యువ క్లబ్‌లు దోహదం

జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించి తద్వారా పర్యాటక ప్రదేశాన్ని తీసుకొచ్చేందుకు, పిల్లల నైపుణ్యం, పరిశుభ్రత, వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు యువ పర్యాటక క్లబ్‌లు దోహదపడతాయని పర్యాటక జిల్లా అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో యువక్లబ్ బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, పర్యాటకశాఖ కమిషనర్ ఆదేశాలననుసరించి ఈ యువ క్లబ్బులను ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రతిఒక్కరూ మన పండగలు, జాతరలు, కళారూపాలపై ప్రస్తుతం యువతకు, భావితరాల వారికి తెలియజేయాలంటే నేటి యువత వాటిపై డాక్యుమెంట్ తీసి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. యువ క్లబ్ వల్ల విద్యార్థులకు నైపుణ్యం పెంపొందుతుందన్నారు. యువ క్లబ్ ఆవశ్యకత వివరించారు. జిల్లాలో ఉన్న పలు పర్యాటక ప్రాంతాల ప్రముఖ్యత వివరించారు. డాక్టర్ గీతాశ్రీకాంత్ ముట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో వివిధ పర్యటిక ప్రదేశాలను పర్యటించి వీడియోగ్రఫీ చేసి, పొటోలు జతచేసి వాటి చరిత్రను తెలుసుకొని పలువురికి తెలియజేయాలన్నారు. జిల్లా పరిసర ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రదేశాలను గుర్తించి వాటి చరిత్ర ఫొటోలను జతపరిచి ఒక డాక్యుమెంట్ తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాగ్దేవి, సహాయ పర్యాటక అధికారి డి.రమేష్, వసంత పాల్గొన్నారు.

కళ్ల 'కలక'లం



ప్రజాశక్తి- జి.సిగడాం

కళ్లు శరీరానికి దీపాల వంటివి... స్వీయ వైద్యం చేసుకోవడం కంటి ఆరోగ్యానికి ఎంతమాత్రం మంచిదికాదు... సర్వేంద్రియానాం నయనం ప్రధానం... కళ్లు శరీరానికి దీపాల వంటివి... వాటిని ఎల్లవేళల కాపాడుకోకపోతే దృష్టిలోపాలు తలెత్తే ప్రమాదం ఉంది... ఇక వాతావరణ మార్పుల కారణంగా కంటి సమస్యలు తలెత్తడం కూడా పరిపాటే... నిజానికి.. కంటికి ఏ చిన్న సమస్య తలెత్తినా కళ్లు ఎర్రబడిపోతుంటాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఇన్‌ఫెక్షన్ బెడద కాస్త ఎక్కువగానే ఉంటుంది. వర్షాలు కురిసిన వెంటనే ఎండలు కాయడం వల్ల కళ్లకలక (కంజెక్టివైటిస్) వంటి కంటి ఇన్‌ఫెక్షన్లు పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కంటి గుడ్డు చుట్టూ ఉండే తెల్లని పొర, కంటి రెప్పల వెనుక ఉండే పొరలను కంజెక్టైవా అని అంటారు. కళ్లలోకి దుమ్ము, ధూళి, నీళ్ల వంటివి పడటం వల్ల కళ్ల కలకకు కారణమయ్యే ఇన్‌ఫెక్షన్ వల్ల బ్యాక్టీరియా, వైరస్ ఎక్కువగా వ్యాపిస్తుంది.

జి.సిగడాం ప్రాథమిక ఆస్పత్రికి జి.సిగడాం, పెంట, బాతువ, నడిమివలస, ఆనందపురం తదితర గ్రామాలకు చెందిన కళ్ల కలకల రోగులు రోసుకు పదుల సంఖ్యలో చికిత్సకు వస్తున్నారు. విద్యార్థులు ఎక్కువగా వీటి భారిన పడ్డారు. చాలా విద్యా సంస్థల్లో కళ్లకలక ఒకరి నుంచి మరొకరికి వ్యాపించింది. ఇది అంటువ్యాధి కావడంతో ఒకరిని మరొకరు తాకినా వ్యాపిస్తుంది. కళ్లకలక సమస్య తలెత్తితే స్వీయ వైద్యం చేసుకోవడం కంటి ఆరోగ్యానికి ఎంతమాత్రం మంచిదికాదు. వైరస్ ఎక్కువగా సోకడం వల్ల కళ్ల కలక ఉన్న రోగుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. కళ్ల కలక రోగులను వారం రోజుల పాటు ఇబ్బంది పెడుతుంది. ఆ తర్వాత తగ్గిపోతుంది. ఒక్కోసారి మూడు వారాలపాటు వేధిస్తుంది. కంటిలోపల ఉండే తెల్లని పొర నుంచి కంటి గుడ్డుకు వ్యాప్తిస్తే చూపు మందగించే ప్రమాదం ఉంది. ఒక్కోసారి కార్నియాకు రంధ్రాలు కూడా పడతాయి. అటువంటి పరిస్థితుల్లో కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.

లక్షణాలు

కళ్లకలక సోకిన వ్యక్తికి సాధారణంగా ఈ కింది లక్షణాలు ఉంటాయి. కళ్లు ఎరుపెక్కడం, నీళ్లు కారడం, రెప్పలు ఉబ్బడం, దురద, గుచ్చుకోవడం, నొప్పి, కళ్ల వాపు, కళ్లకలకతో బాధపడేవారిలో కొంత మందికి జలుబు, దగ్గు, జ్వరం కూడా ఉంటుంది.

ఏం చేయాలి?

కళ్లకలక లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని కంటి వైద్యుడి (ఆప్తమాలజిస్ట్)ని సంప్రదించాలి. ఐ డ్రాప్స్‌తో స్వీయ వైద్యం చేసుకోకూడదు. ఇలా చేస్తే కళ్లపై దీర్ఘకాలిక దుష్ప్రభావాలు చూపుతాయి.

యాంటీబయాటిక్ డ్రాప్స్ వాడాలి



కళ్ల కలక వచ్చినప్పుడు కళ్లు దురదపెడతాయి. ఇలాంటి సందర్భంలో ఎట్టిపరిస్థితుల్లో కళ్లను నులమకూడదు. కంటి నుంచి నీళ్లు కారితే టిష్యుతో తుడిచి వెంటనే డస్ట్‌బిన్‌లో పారవేయండి. కళ్ల కలక ఒకరి నుంచి మరొకరికి సులువుగా వ్యాపిస్తుంది. కళ్లను తాకి, ఆ చేత్తో ఇతరును తాకితే వెంటనే ఈ వ్యాధి వారికీ వ్యాపిస్తుంది. కళ్ల కలకతో బాధపడే వ్యక్తులు కాంటాక్ట్ లెన్సులు వాడడం మానేయాలి. యాంటీ బయాటిక్ డ్రాప్స్ వాడాలి. నీళ్లతో తరచూ కళ్లను కడుగుతుంటే దురద అనిపించదు. **- హరిత, వైద్యాధికారి, జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం**

వ్యక్తి ఆత్మహత్య

లావేరు : మండలంలోని బుడతవలసకు చెందిన కిల్లారి గురవయ్య (57) చీమల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురవయ్య మూడేళ్లుగా కిడ్నీ వ్యాధికి సంబంధించి డయాలసిస్ చేసుకుంటున్నాడు. ఈ నెల 15న కడుపులో నొప్పి తీవ్రంగా రావడంతో తట్టుకోలేక మనస్తాపం చెందాడు. వెంటనే ఇంట్లో ఉన్న చీమల నివారణ మందు తాగి అపస్మారస్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృత్యువాత పడ్డాడు. మృతుడు కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగించేవాడు. మృతికి భార్య సరస్వతి, కుమారుడు గౌరినాయుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ ప్రసాదరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

శ్రీకాకుళం : ఒంగోలులో గిరిజన యువకుడిపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. యువకుడిపైన దాడి చేసి నోట్లో మూత్రం పోయడం దారుణమన్నారు. నిందితులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి జరిగి కొన్ని గంటలు గడుస్తున్నా పోలీస్‌శాఖ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఈ అంశంపై స్పందించాలని కోరారు.

20, 21న విఆర్‌ఎల దీక్ష



త్రినాథరావు

పొందూరు: గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఈ నెల 20,21 తేదీల్లో విఆర్‌ఎల దీక్ష చేపడుతున్నారని విఆర్‌ఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తెండేల త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్ల సాధనకు దీక్ష చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపడుతున్న దీక్షలో విఆర్‌ఎలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఫైలేరియా నివారణకు చర్యలు

డిఎంహెచ్‌ఒ మీనాక్షి



కిట్లను అందజేస్తున్న మీనాక్షి

ప్రజాశక్తి- లావేరు

దోమకాటుతో వచ్చే వ్యాధుల్లో బోదకాలు (ఫైలేరియా) ఒకటని, బోదకాలు నివారణకు చర్యలు చేపడుతున్నామని డిఎంహెచ్‌ఒ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. మండలంలోని అదపాకలో బోదకాలు నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న 48 మంది బాధితులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రెండేళ్లగా బోదకాలు (ఫైలేరియా) వ్యాధి కొత్త కేసులు నమోదు కాలేదన్నారు. ప్రస్తుతం జిల్లాలో 2616 కేసులు ఉన్నాయని తెలిపారు. వీరందరికీ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వ్యాధి సోకిన వారు తమ కాళ్లలను ఏలా శుభ్రం చేసుకోవాలి అన్నదానిపై వైద్య సిబ్బంది చేసి చూపించారు. వ్యాధి నివారణకు ముఖ్యంగా గ్రామాల్లో దోమల లార్వా నివారణకు సంబంధించిన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మందులు అందుబాటులో ఉన్నాయిని పేర్కొన్నారు. దీంతో పాటు గ్రామాల్లో పాంగింగ్ చేయాలన్నారు. జిల్లాలో జూలై నెల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 6 మలేరియా, రెండు డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. జిల్లా అంతటా యాంటీబార్వా ద్రావణం పంపిణీ చేస్తున్నామని వివరించారు. జిల్లాలో 504 వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యాన ఫీవర్ సర్వే చేయించామన్నారు. ప్రతి క్లినిక్‌లోనూ డెంగీ, మలేరియా కిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కాలనుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం అన్ని పిహెచ్‌సిల్లో మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి వి.వి.సత్యనారాయణ, మురపాక వైద్యాధికారి వైద్యాధికారిణి సౌమ్య, వైద్య సిబ్బంది శ్యామసుందర్ పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు నమోదు సర్వే



మెళియాపుట్టి : మాట్లాడుతున్న వెంకట్రామన్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఓటర్ నమోదుపై దృష్టి సారించాలని జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో బుధవారం సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరిరూ ఓటరు నమోదు అయ్యేలా చూడాలని అన్నారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారందరికీ ఓటరు నమోదు చేర్పించాలన్నారు. ఈ సర్వేలో వాలంటీర్లు గాని, రాజకీయ నాయకుల జోక్యం ఉండకూడదన్నారు. ప్రతి బిఎల్‌ఒ వారి పరిధిలోని ఇంటింటినీ సందర్శించి ఆ ఇంటిలోని ఓటర్ల వివరాలు సేకరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కును నమోదు చేయాలన్నారు. ఓటర్లకు చెందిన మార్పులు, చేర్పులనూ పరిగణలోకి తీసుకోవాలన్నారు. కొత్త ఓటర్లు ఉంటే వాటిని నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇంటి నెంబరు సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, డిటి శంకరరావు పాల్గొన్నారు.

జలుమూరు: ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు చేపట్టనున్న ఓటర్ల నమోదు వివరాలు సేకరించినందుకు వాలంటీర్లను వినియోగించకుండా స్వయంగా బిఎల్‌ఒలే ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టాలని ఇఆర్‌ఒ జి.జయదేవి ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు.తహశీల్దార్ బి.సత్యం పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: గ్రామాల్లో ఈ నెల 21 నుంచి జరగనున్న ఓటరు జాబిత సర్వేకు అన్ని రాజకీయ పార్టీ నాయకులు బిఎల్‌ఒలకు సహకరించాలని తహశీల్దార్ వాన ఈశ్వరమ్మ కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమీక్షించారు. ఓటర్లను పూర్తిగా పరిశీలించి అందులో తప్పులు ఉంటే తమకు తెలియజేస్తే అవి సరిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, పేడాడ వెంకటరావు, గడ్డవలస నాగభూషణరావు, టిడిపి నాయకులు వెలమల కామేశ్వరరావు, బోయిన రమేష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న ఓటర్ల నమోదు సర్వే పక్కాగా నిర్వహించాలని ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీ నాయకులు, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ బిఎల్‌ఒలతో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఎస్.గణపతిరావు, పి.వేణుగోపాలరావు, రమేష్‌కుమార్, రమణారావు, ఎన్నికల డిటి మురళీధర్ నాయక్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పాలకమండలి సభ్యులు సేవకులు

శ్రీకాకుళం అర్బన్ : దేవాదాశాఖ పరిధిలోని ఆలయాల్లో పాలక మండలి సభ్యులుగా నియమితులైన వారంతా సేవకులని, ఆయా ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించడంలో తమవంతు తోడ్పాటు అందించాలని దేవాదాయశాఖ పాలన సంస్థ రాష్ట్ర డైరెక్టర్ రామచంద్రరావు అన్నారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిలాల్లోని వివిధ ఆలయాల పాలక మండలి చైర్మన్లకు, సభ్యులకు బుధవారం శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలక మండలి సభ్యులకు ఆలయ ఇఒలతో సత్సంబంధాలు ఉండాలన్నారు. కొందరు పాలక మండలి సభ్యులు తమ సొంత డబ్బుతో ఆలయాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు, పాలక మండలి ఎక్స్ అఫీషియో సభ్యులు ఇప్పిలి శంకరశర్మ మాట్లాడుతూ ఆలయ సంస్కృతి, సంప్రదాయాలపై సభ్యులకు అవగాహన ఉండాలన్నారు. దేవదాయ శాఖ విశ్రాంత అధికారి టి.పి.ఎన్.మూర్తి ఇఒలకు, పాలక మండలి సభ్యులకు సమన్వయంపై పలు సూచనలు చేశారు. ఈ తరగతుల్లో అరసవల్లి ఇఒ వి.హరిసూర్యప్రకాష్, పాలక మండలి సభ్యులు లుకలాపు గోవిందరావు, దుక్క గనిరాజు, జలగడుగుల శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లేమ్మ, ద్వారపు అనురాధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరిసూర్యప్రకాష్

రామ్మోహనరావు పరామర్శ



పరామర్శిస్తున్న రామ్మోహనరావు

ఆమదాలవలస : మున్సిపాలిటీ పరిధిలోని జనసేన పార్టీ అభిమానుల మృతుల కుటుంబాలను నియోజక వర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు బుధవారం పరామర్శించారు. వెంగళరావు కాలనీకి చెందిన రామ్ సాయి అనారోగ్యం కారణంగా మృతి చెందాడు. అలాగే నాలుగో వార్డు గేదెలవానిపేట పరిధిలోని వాకాడ సింకయ్య కుటుంబాలను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జనసేన పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని వారికి భరోసానిచ్చారు. కార్యక్రమలో సరుబుజ్జిలి మండల అధ్యక్షులు పైడి మురళి మోహన్ పాల్గొన్నారు. ఈయన వెంట బగాది ఫణికుమార్, గంగు కోటేష్, సాగర్, తవిటినాయుడు ఉన్నారు.

నేడు బిఎల్‌ఒలతో సమావేశం

టెక్కలి : టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 20న డివిజన్‌స్థాయి బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నామని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియలో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆదేశించారు. ఈ సమావేశానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరుకావాలని అన్నారు.



నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

డిసిసిబి ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి- పొందూరు

పిఎసిఎస్ ఉద్యోగులు సమస్యలు పరిష్కారం కోరుతూ అమరావతిలో చేపడుతున్న పోరాటానికి మద్దతు తెలుపుతూ బుధవారం మండల కేంద్రంలోని డిసిసిబి ఉద్యోగులు మధ్యాహ్నం భోజన సమయంలో నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, డిసిసిబి, పిఎసిఎస్ ఉద్యోగుల ఉద్యోగులు విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. 2019 పే రివిజన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి మేనేజర్ కిషోర్, పిఎసిఎస్ సిఇఒ ఎర్నేన పాపినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

షక్కర్ చేప లభ్యం

ప్రజాశక్తి- పలాస

పలాస ఎర్రచెరువులో మత్స్యకారులు బుధవారం మధ్యాహ్నం చేపలు పడుతుండగా అరుదైన మచ్చలు, కొమ్ములు ఉన్న చేప లభ్యమైంది. దీనికి షక్కర్ మౌత్ క్యాట్ ఫిష్ అని పిలుస్తారని మత్స్యకారులు తెలిపారు. చెరువులో అదే ప్రాంతానికి చెందిన ప్రసాదరావు చేపలు పడుతుండగా షక్కర్ మౌత్ క్యాట్ ఫిష్ లభ్యమైంది. ఒడిశా, తెలంగాణ, బెంగాల్, కేరళ, తమిళనాడు, బీహార్ రాష్ట్రాల్లో ఇటువంటి అరుదైన జాతిగత చేపలను గుర్తించినట్లు జీవ వైవిధ్యశాస్త్రవేత్తలు గుర్తించారు. ఇటువంటి చేపలు నీరు ఎక్కువగా ఉన్న చెరవుల్లో ఉంటుంది. నోటి వద్ద షక్కర్ ఉంటుంది కనుక దీన్ని షక్కర్ ఫిష్, షక్కర్ మౌత్ క్యాట్ ఫిష్, అమెజాన్ సెయింట్ ఫిష్ అని కూడా మత్స్యకారులు పిలుస్తుంటారు. ఈ చేపలు వలలను నాశసనం చేస్తుంది. పట్టుబడిన చేప 700 గ్రాములకు పైగా బరువుతో ఉంది.



షక్కర్ మౌత్ క్యాట్ ఫిష్

మురుగు నీటి సమస్యను పరిష్కరించాలి

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన రహదారిపై మురుగు నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ రహదారిపై గతంలో మురుగు, వర్షపు నీరు సాంఘిక బాలుర వసతిగృహంలోకి వెళ్లడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని గుర్తు చేశారు. దీనిపై వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐలు సంయుక్తంగా ఆందోళన చేస్తే.. అప్పట్లో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి వచ్చి వసతిగృహాన్ని పరిశీలించారని అన్నారు. అనంతరం విద్యార్థులను నూతనంగా నిర్మాణం చేపట్టిన బాలికల వసతి గృహంలోకి మార్చాలని రెవెన్యూ, రోడ్ల, భవనాలు శాఖాధికారులకు ఆదేశించినా ఇప్పటికీ ఆ సమస్య పరిస్కారం కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కొద్ది నెలల తరువాత కాంట్రాక్టరు సిమెంట్ రహదారి నిర్మించి ఒక వైపు కాలువ నిర్మించారని అన్నారు. కానీ, మురుగునీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రోడ్డుపైనే ప్రవహిస్తుందని అన్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరోవైపు దోమలు విజభిస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మహిళల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ



మాట్లాడుతున్న డాక్టర్ హర్షవల్లి

శ్రీకాకుళం అర్బన్ : మహిళలు నిర్ణీత కాలంలో నిరంతరం పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్య వంతమైన జీవనాన్ని గడపాలని, అప్పుడే కుటుంబ అభివృద్ధి సాధ్యమవుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షులు డాక్టర్ సంపతిరావు శ్రీదేవి అన్నారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో మహిళల ఆరోగ్యం, పౌష్టికాహారం ప్రాముఖ్యతపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం కుటుంబ కోసం శ్రమించే మహిళల జీవన విధానంలో అనేక మార్పులు వచ్చాయని, వారిపై నా ఒత్తిడి పెరగడంతో దీర్ఘకాలిక వ్యాధులు వస్తున్నాయని అన్నారు. క్రానిక్ డిసీజెస్‌తో మహిళలే ఎక్కువ శాతం అనారోగ్యం తో బాధపడుతున్నారని అన్నారు. సమతుల్యమైన ఆహారం తీసుకోకపోవడంతో రుతు సంబంధిత సమస్యల వల్ల ఎక్కువ మంది అనారోగ్య పాలవుతున్నారని అన్నారు. స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ హర్షవల్లి, డాక్టర్ శిరీష, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్య చంద్రరావు, యువ టూరిజం కో-ఆర్డినేటర్ వర లక్ష్మి, డిటిఒ నారాయణరావు, జెసిఐ దూసి సంతోష్, శంకర్‌నారాయణ, గీతాశ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్‌బికెలతో రైతులకు బాసట



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: రైతులకు సేవలు అందించే దిశగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని సత్యవరంలో రైతు భరోసా కేంద్రం, పబ్లిక్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు శుభిక్షంగా ఉంటే రాష్ట్ర శుభిక్షంఅ ఉంటుందన్న ఉద్దేశంతోనే రైతులు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామని తెలిపారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. అనంతరం దూకలపాడులో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ఆరంగి మరళి, జెడ్‌పిటిసి ప్రతినిధి చింతు రామారావు, సర్పంచ్ బి.శంకరరావు పాల్గొన్నారు.

'హ్యుందయ్ మోటార్'కు ఐదుగురు ఎంపిక

టెక్కలి రూరల్ : ప్రముఖ వాహన రంగానికి చెందిన హ్యుందయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ కంపెనీ హైదరాబాద్‌కు ఉద్యోగ నియామకాలు బుధవారం చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలో మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. 2022-23లో మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన ఈ ఐదుగురు ఏడాదికి రూ.5 లక్షల ఆకర్షణీయమైన వేతనాలతో ఎంపికయ్యారని చెప్పారు. వీరికి నాగేశ్వరరావుతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, మెకానికల్ హెచ్‌డి డాక్టర్ డి.శ్రీరాములు, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్.ఎస్.కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజల జీవితాల్లో ఆర్థిక వెలుగులు



ఆమదాలవలస : పథకాల లబ్ధిని విస్తరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నింపుతూ వారికి భరోసాను కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పురపాలక సంఘంలోని 5వ వార్డు పరిధిలోని పంతులుపేట, సొట్టవానిపేటల్లో గడపగడపకు మన ప్రభుత్వం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్ల కాలంలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. నాడు-నేడుతో గ్రామాల్లోని పాఠశాలల రూపురేఖలు మార్చారని అన్నారు. సేద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులను చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, సచివాలయాల కో-ఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, రవికాంత్, విజయ్, చెంచుల ఎర్రయ్య, గుండ కైలాస్, గోద్దు రమణ, సిమ్మ నాగరాజు యాల్ల హేమంత్, తలవరపు చిన్నారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వజ్రపుకొత్తూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించే ఘనత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పెద్దబడం పంచాయతీలో సర్పంచ్ పీతా మోహనరావు ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలిలాలు అందుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపెల్లి ఉదయ్ కుమార్, మాజీ సర్పంచ్ కొర్రాయి గిరి, కొర్రాయి గోపి, హేమంత్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : సంక్షేమానికి చిరునామా వైసిపి ప్రభుత్వమని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలోని కేసుపురం సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ సల్ల సుగుణ, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, ఎఎంసి చైర్మన్ ఎన్.బాబూరావు, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, ఎంపిటిసి చక్రవర్తి పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : పోస్టర్‌ను అందజేస్తున్న విజయ

65 మందికి వైద్య పరీక్షలు



రోగులకు సూచనలు చేస్తున్న డాక్టర్ అవని

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి మలగాం పంచాయతీ చెరువు గట్టుపేటలో వైద్యాధికారి డాక్టర్ అవని 65 మంది రోగులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బిపి, షుగర్ థైరాయిడ్, జ్వరాలు, కళ్లు కలకలు వంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పెరాలసిస్ బారిన పడి మంచానికి పరిమితమైన వ్యాధిగ్రస్తుడు ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, ప్రజలకు పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాధులు బారిన పడకుండా ముందుస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రస్తుతం ఉధృతంగా కళ్ల కలకలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు హెచ్.పి.జ్యోతి, అప్పలనర్సమ్మ, వాల్త్ అసిస్టెంట్ చిరంజీవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'గ్లోబల్ న్యూరో కేర్'లో అరుదైన శస్త్రచికిత్స



అప్పన్నకు శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న గ్లోబల్ న్యూరోకేర్ ఆస్పత్రిలో బుధవారం అరుదైన బ్రెయిన్ సర్జరీ నిర్వహించారు. ఆస్పత్రి చీఫ్ న్యూరో సర్జన్ డాక్టర్ దేవరెడ్డి గౌతమ్, చీఫ్ అనస్తీషియన్ డాక్టర్ ఐ.ఎస్.డి.ప్రసాద్ ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలోని జలుమూరు మండల కేంద్రంలో నివాస ముంటున్న అప్పన్న అస్వస్థతకు గురయ్యాడు. అతనిని వైద్యం కోసం గ్లోబల్ న్యూరక్ష కేర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షల అనంతరం ఆయనకు మెదడులో రక్తనాళాల వాపు (బ్రెయిన్ ఎన్యూరిజం) ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. అతనికి సోకిన బ్రెయన్ ఎన్యూరిజం వ్యాధికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు చెప్పడంతో బాధితుని కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అయితే మైక్రో స్కోపిక్ విధానంలో బ్రెయిన్ సర్జరీతో ఈ శస్త్ర చికిత్స నిర్వహిస్తామని, ఆందోళన చెందాల్సిన పనిలేదని వైద్యులు ధైర్యం చెప్పి ఆపరేషన్ చేశారు. వాపు ఉన్న రక్తనాళాలను తొలగించి కొత్తగా నాళాలను అమర్చి ఈ శస్త్ర చికిత్స నిర్వహించినట్టు వైద్యులు చెప్పారు. సుమారు ఐదు గంటల పాటు శ్రమించి ఈ అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రోగి బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.



కూలిన ప్రహరీ

కూలిన పాఠశాల ప్రహరీ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి కొంచాడ పంచాయతీ లుట్టపేటలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలిపోయింది. పాఠశాలలోని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షానికి నీరుకారుతూ శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనంటూ విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతూ భయాందోళన చెందుతున్నారు. ఇప్పుడు వర్షానికి పాఠశాల ప్రహరీ మంగళవారం రాత్రి సమయంలో కూలిపోయింది. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలో తరగతులు నిర్వహిస్తే ఏ సమయంలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

రేపు జలుమూరు మండల సమావేశం

జలుమూరు: ఈ నెల 21న మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి వాన గోపి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొవాలన్నారు. మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.



మాట్లాడుతున్న మేనేజర్ సంధ్యారాణి

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి

ఆమదాలవలస : మహిళా స్వయంశక్తి సంఘాలకు ఏడు నుంచి తొమ్మిది శాతం వడ్డీలకు రుణాలను అందిస్తున్నట్లు డిసిసిబి బ్యాంకు మేనేజర్ సంధ్యారాణి తెలిపారు. స్థానిక మండల మహిళా సమైక్యలో తమ్మినేని ధనలక్ష్మి ఆధ్వర్యాన గ్రామ సంఘాల సిబ్బందికి బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.3 లక్షల లోపు రుణాలకు 7 శాతం, రూ.5 లక్షల లోపు రుణాలపై 8 శాతం, రూ.5 లక్షల పైన రుణాలపై 9 శాతం వడ్డీకి రుణాలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సేవింగ్ ఖాతాలో పొదుపు చేసుకున్న నిల్వలను సభ్యులు ఇంటర్నల్ లెండింగ్ చేసుకోవడానికి సంఘం తీర్మానం ప్రకారం విత్ డ్రాకు అనుమతిస్తామని తెలిపారు. ఆహార ఉత్పత్తులతో పాటు ఇతర ఉత్పత్తులు చేస్తున్న వారికీ అదనపు మిషనరీల కొనుగోలు నిమిత్తం పిఎం, ఇజిపి పథకాల ద్వారా పరిశీలించి అర్హత కల వారందరికీ రుణాల మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిఎం కూర్మారావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, మండల మహిళా సమాఖ్య అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ పాల్గొన్నారు.

సిడిపిఒ తీరు మార్చుకోవాలి

ఆమదాలవలస : మహిళా శిశు అభివృద్ధి అధికారి కె.బాలామణి తీరు మార్చుకోవాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కనుగులవలస సర్పంచ్ నూకరాజు అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలను పట్టించుకోవాలని కార్యాలయానికి వెళ్తే అందుబాటులో ఉండడం లేదని, ఫోన్‌లో ఆమెను సంప్రదిస్తే స్పందించడం లేదని అన్నారు. అధికార పార్టీ అండదండలతో కార్యకర్తగా పనిచేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఉమ్మడి జిల్లా వీరఘట్టంలో విధులు నిర్వహించేటప్పుడు 1919 లీటర్లతో పాల వ్యాను బత్తిలి వద్ద పోలీసులకు పట్టుబడిన కేసులో 26 మంది అంగన్వాడీ కార్యకర్తలపై చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ క్రమంలో అప్పటి ఇప్పటి పీడీ జయదేవి ఉన్నతాధికారుల ఆదేశాలతో క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అనంతరం ఈమెకు హిందూపురం ఎసిడిపిసిగా రివర్స్ పోస్టింగ్ ఇచ్చారని, అక్కడ విధులు నిర్వహించకుండా రాజకీయ పలుకుబడితో డెప్యుటేషన్‌పై ఆమదాలవలస సిడిపిఒగా విధులు ఎలా నిర్వహిస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల 'ప్రజాశక్తి'లో వచ్చిన "పైసా వసూల్" కథనంతో అంగన్వాడీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఈమెపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

న్యాయం చేయరూ...

ఇచ్ఛాపురం : రత్తకన్న జగనన్న కాలనీ స్థలాలు తనవని, కోర్టు ఆర్డర్ కూడా ఉందని టిడిపి పట్టణ అధ్యక్షులు కాళ్ల ధర్మారావు లబ్ధిదారులను బెదిరిస్తున్నారని వార్డు కౌన్సిలర్లు సిహెచ్.జగన్నాయకులు, తాడి ఆదిరెడ్డి అన్నారు. ఈ మేరకు తహశాల్దార్ మీనాదేవిని బుధవారం కలిసి లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని రత్తకన్న జగనన్న కాలనీ సర్వే నంబరు 197లో ఉన్న రెండు ఎకరాల స్థలాన్ని 2021లో రూ.12 లక్షలు ఖర్చు చేసి చదును చేశారని అనానరు. 102 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించారని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి జియో ట్యాగ్ కూడా పూర్తయిందన్నారు. ఇప్పుడు ధర్మారావు కోర్టు ఆర్డర్ ఉందని బెదిరిస్తున్నారని అన్నారు. ఈ సమస్యపై సమగ్ర విచారణ చేపట్టి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాళ్ల సత్యరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

కోటబొమ్మాళి: వైసిపి ప్రభుత్వంలో రోజురోజుకూ మహిళలపై దాడులు పెరుగుతున్నాయని టెక్కలి నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షులు పూజారి శైలజ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడలు, హింసలకు సంబంధించి గురువారం మండల కేంద్రాలలో తెలుగు మహిళ విభాగంలో మహిళల ఆత్మగౌరవం కాపాడాలని నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మాజీ ఎంపిపి వెలమల విజయలక్ష్మి, మట్ట సుందరమ్మ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి వాన లక్ష్మి, మాజీ సర్పంచ్‌లు దేవాది సింహాద్రమ్మ, శిమ్మ వరలక్ష్మి, సంతబొమ్మాళి జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బాడాన రమణమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శైలజ

'జగనన్న సురక్ష'ను వినియోగించుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : పార్టీలకతీతంగా సిఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని మాట్లాడారు. సిఎం ఇచ్చిన మాటకు కట్టుబడి రుణాలతో పాటు వడ్డీ ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారని అన్నారు. నగరంలోని పెద్ద మార్కెట్ రూపు రేఖలను పూర్తిగా మార్చేశామన్నారు. రిమ్స్‌లో 900 బెడ్స్ అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అధికారి వెంకటరావు, మాజీ కౌన్సిలర్ పిల్లల నీలాద్రి, అర్జున్‌రెడ్డి, చిన్నబాబు, ఖాన్, భానుప్రసాద్, అశిరినాయుడు, పొన్నాడ రిషి, భాస్కరరావు పాల్గొన్నారు.

పలాస : రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని పశువర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని చినంచలలో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం దేశానికే ఆదర్శమన్నారు. కంబిరిగాం కూడలి నుంచి పెదంచల వరకు బిటి రోడ్డు పున:నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తయిందన్నారు. పాఠశాలను నాడు-నేడు పథకం కింద అభివృద్ధి చేస్తామని



పలాస : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న అప్పలరాజు

అన్నారు. అనంతరం 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జి.వేణుగోపాల్, సర్పంచ్ ప్రతినిధి కంచరాన భాస్కరరావు, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, డిటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని మాసాహెబ్‌పేట సచివాలయం వద్ద సర్పంచ్ సంపతిరావు ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, తాటిపర్తి సర్పంచ్ రెడ్డి లక్ష్మణ్, మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, డిటి ఆర్.మధు, పంచాయతీరాజ్ జెఇ లతశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కావ్యశ్రీ, హౌసింగ్ ఎఇ రెడ్డి పాపినాయుడు, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని వసుంధరలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేందరరావు, ఇఒపిఆర్‌డి తారకేశ్వరి, మండల ఎఒ దానకర్ణుడు, ఎపిఎం లలిత పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని పెద్దతామరాపల్లిలో సర్పంచ్ తమిరి దేవేంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురుమాన బాలకృష్ణారావు, మండల ప్రత్యేక అధికారి మురళీకృష్ణ, ఎంపిడిఒ జి.శివప్రసాద్, డిటి ఎన్.భాగ్యలక్ష్మి, మండల ఎఒ శ్రీకాంత్‌వర్మ పాల్గొన్నారు.



శ్రీకాకుళం : మాట్లాడుతున్న మంత్రి ధర్మాన

వజ్రపుకొత్తూరు : మండలంలోని నగరంపల్లిలో సర్పంచ్ దువ్వాడ పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపెల్లి ఉదయ్‌కుమార్ పాల్గొని 11 రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపిటిసి ప్రతినిధి బి.మోహనరావు, మామిడి గోవిందరావు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలోని గొల్లలవలస, దీర్ఘాశిలో నిర్వహించిన జనగన్న సురక్షలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య పాల్గొని వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, సర్పంచ్ ప్రతినిధి పి.జగన్, ఎంపిటిసి ప్రతినిధి సూరపు జయరాం, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, కణితి సత్తిబాబు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న సర్పంచ్ పద్మావతి



చెక్కును అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

రూ.20 లక్షల బీమా అందజేత

పొందూరు: మండలంలో కోటిపల్లిలో గురుగుబెల్లి పెంటారావు పాముకాటుతో మృతి చెందారు. మృతుడి భార్య కళావతికి ఎపిజివిబి పార్వతీపురం రీజనల్ మేనేజర్ రాఘవేంద్ర రూ.20 లక్షల ప్రమాద బీమా పరిహారం చెక్కును బుధవారం అందజేశారు. వాంద్రంగి ఎపిజివిబి శాఖలో ఖాతాదారునిగా ఉన్న మృతుడు రూ.1000ల ఎస్‌బిఐ జనరల్ ప్రీమియం చెల్లించారు. ఆయనకు బీమా వర్తించడంతో పరిహారం మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి అసిరినాయుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు రమణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



గౌరీశంకర్‌ను సన్మానిస్తున్న స్వామినాయుడు

గౌరీశంకర్‌కు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర శివారుల్లో ఉన్న గురజాడ విద్యాసంస్థ గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ తెలుగు అధ్యాపకులు భవిడిపిటి గౌరీశంకర్ అరుదైన గౌరవం దక్కింది. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో ఉన్న భాషా అధికార సంస్థ ఆయనను తన ప్రాజక్టుకు ఎంపిక చేశారు. 'కళింగాంధ్ర దేవాలయలు.. తెలుగు శాసనాలు' అనే అంశంపైన ఆయన పనిచేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఎంపికను సంస్థ ఖరారు చేసినట్టు వివరించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు గౌరీశంకర్‌ను సన్మానించారు. కార్యక్రమలో ఐక్యూఎసి సమన్వయ కర్త డాక్టర్ మార్తండ కృష్ణ, రాజ్‌కుమార్, కె.వి.సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షునిగా అప్పన్న

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ శ్రీకాకుళం యూనిట్‌కు సంబంధించి కార్యవర్గ ఎన్నిక బుధవారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా నరస్నపేట మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్.తిరుపతిరావు, ఎచ్చెర్ల మండల పరిషత్ టైపిస్టు ఆర్.శేషగిరిరావు వ్యవహరించారు. ఈ ఎన్నిక జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయ, ఎస్‌సి కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఓటర్లుగా పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు దుంపల అప్పన్న, సీనియర్ సహాయకులు, పిఐయు శ్రీకాకుళం డివిజన్, జనరల్ సెక్రటరీగా కె.కామేశ్వరరావు, జూనియర్ సహాయకులుగా కొత్తకోట లక్ష్మణరావు, సీనియర్ సహాయకులుగా గేదెల దేవేంద్ర



నియామకపత్రం అందజేస్తున్న తిరుమలరావు

వర్మలు ఎన్నికయ్యారు. సీనియర్ సహాయకులుగా మాసపు సంతోష్ కుమార్, జాయింట్ సెక్రటరీగా సోమేశ్వర పాడి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.వి.రమణ, జిల్లా కౌన్సిలర్-1గా ధర్మాన సుందరరావు, జిల్లా కౌన్సిలర్-గా ఎస్.పి.కె.రాజు, జిల్లా కౌన్సిలర్-3గా వి.జగదీశ్వరరావు, జిల్లా కౌన్సిలర్-4గా వి.మీనాకుమారి, కార్యవర్గ సభ్యులుగా పి. వెంకటి, ఎం.లక్ష్మీనారాయణ, ఎల్.వెంకట్రామన్, ఎస్.విజేంద్రకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాలువ మరమ్మతులకు నిధుల మంజూరు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నుంచి గోపినాథపురం వంశధార సాగునీటి కాలువ మరమ్మతులకు రూ.కోటి 68 లక్షల, 70 వేలు నిధులు నిధులు మంజూరైనట్లు వంశధార ప్రాజెక్టు ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ ఎ.రామకృష్ణ తన లేఖ ద్వారా తెలియజేశారని ఈ ప్రాంత రైతు సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. 49ఆర్ వంశధార ప్రధాన ఎడమ కాలువ ద్వారా సాగునీరు సక్రమంగా రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇటీవల స్పందనలో వినతిపత్రం అందజేశామని అన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారని తెలిపారు. మంజూరైన నిధులు మేరకు అంచనాలు తయారు చేశామని, ఇందుకు సంబంధించి క్వాడ్ కమిటీ ఆమోదం కూడా ఇచ్చారని అన్నారు. టెండర్లు ప్రక్రియ పూర్తయిన వెంటనే మరమ్మతు పనులు చేపడతారని తెలిపారు. త్వరగా పనులు ప్రారంభిస్తే మంచిదని అభిప్రాయాన్ని అధికారుల ముందు ఉంచామని అన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

మెళియాపుట్టి : మండలంలోని మురికింటిభద్ర ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుని లఖినాన దివ్యకు ప్రధానోపాధ్యాయులు సవర అన్నాజీ, గ్రామస్తులుబుధవారం సన్మానించారు. పాఠశాలకు ఆమె చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చాపర మాధవరావు, ఎస్.తిరుపతి, భావనాపురం ప్రధానోపాధ్యాయులు టి.కామేశ్వరరావు, మెట్ట గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని కోటిపల్లి పంచాయతీ మజ్జిలిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ప్రధానోపాధ్యాయులు వి.వి.సత్యనారాయణ ఆధ్వర్యాన



మెళియాపుట్టి : సన్మానిస్తున్న గ్రామస్తులు

సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాలకు వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం బదిలీ ఉపాధ్యాయులు కల్లూరి రంగారావు, బి.వెంకటగిరిధర్, పి.రాజ్యలక్ష్మి, మీనాకుమారి, ఎస్.సావిత్రిలను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రంటలు సాగు చేసేటప్పుడు కొన్ని మెలికవలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి జక్కువ సౌజన్య రైతులకు సూచించారు. మండలంలోని తెట్టంగిలో బుధవారం పొలంబడి కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నారుమళ్లలో సస్యరక్షణ చర్యలను వివరించారు. జీలుగు వేసిన రైతులు కలియన్ని సూపర్ ఎకరాకు మూడు బస్తాలు చొప్పున వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



బీమా అందజేస్తున్న అధికారులు

వైఎస్ఆర్ బీమా అందజేత

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలంలోని గోవిందపురం సచివాలయం పరిధి వడ్డివాడలో సిల్లా వజ్రం ఈ నెల 3న మృతి చెందారు. ఈయనకు వైఎస్ఆర్ బీమా వర్తించడంతో చంద్రశేఖర్‌కు తక్షణ సాయం కింద రూ.పది వేలు కార్యదర్శి డి.వాసు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.వంశి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పల్లి లక్ష్మణరావు, వాలంటీర్లు పాల్గొన్నారు



ప్రారంభిస్తున్న గోవిందరావు

'రాయల్ టెక్నాలజీస్ కంప్యూటర్స్' ప్రారంభం

పాతపట్నం: పాతపట్నంలోని రాయల్ టెక్నాలజీస్ కంప్యూటర్స్ బి.ఖగేశ్వరరావు ఆహ్వానం మేరకు టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయల్ టెక్నాలజీస్ కంప్యూటర్స్ వ్యాపార అభివృద్ధి జరిగి కంప్యూటర్ వినియోగదారులకు ఉపయోగపడాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



విత్తనాలను పంపిణీ చేసిన చిరంజీవిరావు

కిచెన్ గార్డెన్ విత్తనాల పంపిణీ

అమదాలవలస : ప్రకృతి సేద్యంలో పెరటి తోటల సాగును ప్రోత్సహిస్తున్నామని ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు తెలిపారు. మండలంలోని చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు కిచెన్ గార్డెన్ విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఉన్న తక్కువ స్థలంలో పలు రకాల కూరగాయల విత్తనాలను వేసుకొని పండించడం వల్ల కుటుంబానికి అవసరమైన పోషక విలువలతో కూడిన కూరగాయలు పొందవచ్చునని తెలిపారు.

బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని అరసవల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన డిసిబి బ్యాంకును కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు లాంఛనంగా బుధవారం ప్రారంభించారు. కొత్తగా ఏర్పాటైన బ్యాంకుశాఖ ద్వారా జిల్లాలో ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు వీలుందని వారు పేర్కొన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లా అయిన శ్రీకాకుళంలో రైతాంగానికి, పారిశ్రామికరంగానికి ఊతమందించాలని సూచించారు.



ప్రారంభిస్తున్న కృపారాణి, లక్ష్మీదేవి